Namasthe Telangana 01-01/05/18 -



నగరంలో రోడ్లపై నీరు నిలువకుండా చేయడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ స్ఫూర్తితో రోడ్లపై లోతట్టు ప్రాంతాల్లో ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతల తవ్వకాన్ని షురూ చేశారు. మొదటగా కూకట్‌పల్లిలోని మెట్రో రైల్వే స్టేషన్ల వద్ద ప్రారంభమైన ఈ పనులు నగర వ్యాప్తంగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో రానున్న వర్షాకాలంలో రోడ్లపై వర్షపు నీటి సమస్యలు తీరనున్నాయి.

# లోతట్టుకు.. ఇంజక్షన్.!



కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ వద్ద లోతట్టు ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంత

**లోతట్టు ప్రాంతాల్లో.. ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలు**

**మెట్రో రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో పనులు షురూ**

**కూకట్‌పల్లి మెట్రో రైల్ మార్గంలో మూడు చోట్ల కొనసాగుతున్న నిర్మాణాలు**

**కేపీహెచ్‌బీ కాలనీ స్టేషన్‌లో 2, బాలానగర్ స్టేషన్‌లో 1 చోట**



కేపీహెచ్‌బీకాలనీ మెట్రో రైల్వేస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిన లోతట్టు ప్రాంతం

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 30 : నగరంలో చిరుజల్లులు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి పోవడం సాధారణంగా గమనిస్తుంటాం. రోడ్డు పక్కన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిస్తే ఆ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. జాతీయ రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో సైతం లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా జీహెచ్‌ఎంసీ, ఇతర విభాగాల అధికారులు పలు ప్రయత్నాలు చేసినా పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతున్నారు. మరోవైపు రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో గుంతలు ఏర్పడడంతో రోడ్డు దెబ్బతిని మరలా రోడ్డు మరమ్మతు పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిలువలను తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ రకాలుగా ఆలోచనలు చేస్తున్న క్రమంలో జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ తరహాల్లో ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతల విధానాన్ని అమలు చేస్తే బాగుంటుందని నిర్ణయానికి వచ్చారు. దీనిలో భాగంగా మొదటగా మెట్రో రైల్వే స్టేషన్ మార్గాలలో లోతట్టు ప్రాంతాలలో ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు (హెచ్‌ఎంఆర్) అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా కూకట్‌పల్లి జాతీయ రహదారి మార్గంలో మెట్రో రైల్వే స్టేషన్ల పక్కన ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతల పనులకు శ్రీకారం చుట్టారు. ఇదే తరహాలో భవిష్యత్‌లో మరి కొన్ని చోట్ల ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలను నిర్మించి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్ మెట్రో రైల్వేస్టేషన్ల వద్ద ఇంకుడు గుంతలు**

మియాపూర్, నాగోల్ మార్గంలో మెట్రో రైల్ పరుగులు తీస్తుండడంతో మెట్రో రైల్వేస్టేషన్ల వద్ద పార్కింగ్, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు హెచ్‌ఎంఆర్ అధికారులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్ అంబేద్కర్ మెట్రోస్టేషన్ల వద్ద వర్షంనీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించారు. మెట్రోస్టేషన్ల పక్కన రోడ్లపై లోతట్టు ప్రాంతంలో వర్షంనీటి నిల్వలను తగ్గించడానికి ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలను నిర్మించాలని నిర్ణయించారు. కేపీహెచ్‌బీ కాలనీ మెట్రో రైల్వే స్టేషన్ వద్ద 2, బాలానగర్ అంబేద్కర్ మెట్రోస్టేషన్ వద్ద 1 ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించగా పనులు చకచకా సాగుతున్నాయి. 15 రోజుల క్రితం రోడ్లపై బోర్‌వెల్‌ను తవ్వడంతో పాటు ఇంకుడు గుంతల పనులు వేగంగా సాగుతున్నాయి.

**భూగర్భ నీటి మట్టం పెంపుకోసం**

కాంక్రీట్ జెంగిల్‌లా మారిన నగరంలో వర్షంనీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకపోవడంతో నగరంలో రోజురోజుకు భూగర్భ జాలాలు అడుగంటి పోతున్నాయి. వేల మీటర్ల కిందికి వెళ్లిన నీటి మట్టాల పెంపు కోసం ప్రజలందరు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని వివిధ మార్గాల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నది. మరోవైపు ప్రభుత్వమే అవకాశమున్న చోట్ల ఇంకుడు గుంతలను తవ్వుతుండగా మరికొన్ని చోట్ల ప్రజలను, ప్రైవేట్ సంస్థలను భాగస్వాములను చేస్తూ భారీగా ప్రచారం చేస్తుంది. దీనిలో భాగంగానే జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలను నిర్మించాలని నిర్ణయం తీసుకుని ఆదిశగా ఆయా ప్రాంతాల్లో పనులు మొదలు పెట్టింది.

**150 ఫీట్ల లోతులో**

ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతల విధానంలో ముందుగా లోతట్టు ప్రాంతంలో 150 ఫీట్ల లోతు బోరు బావిని తవ్వి కేసింగ్‌కు రంధ్రాలు చేయడం జరుగుతుంది. దీని చుట్టూరా 4 మీటర్ల పొడువు, 2.5 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతు గుంతను తవ్వి కంకర, ఇసుకను పోసి ఇంకుడు గుంతను తయారు చేయడం జరుగుతుంది. దీనివల్ల లోతట్టు ప్రాంతంలోని వర్షంనీరు భూమిలోకి చేరుకోవడం జరుగుతుంది. తద్వారా లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వల సమస్య తీరడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు కూడా ఈ విధానం దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**లోతట్టు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు**

నగరంలోని మెట్రోరైల్ మార్గంలో మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో వర్షంనీరు నిలిచే లోతట్టు ప్రాంతాలను గుర్తించడం జరుగుతుంది. గత పది రోజుల క్రితం కురిసిన వర్షానికి కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్ మెట్రోస్టేషన్ల వద్ద రోడ్డుపై నీరు నిల్వడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ రెండు ప్రాంతాల్లో మూడు చోట్ల ఇంజక్షన్ బోర్‌వెల్ ఇంకుడు గుంతలను నిర్మించాలని నిర్ణయించి పనులు చేపడుతున్నాం. మిగిలిన మెట్రో రైల్ స్టేషన్ల వద్ద కూడా వర్షం నీరు రోడ్డుపై నిలిచే లోతట్టు ప్రాంతాల్లో ఇదే తరహాలో ఇంకుడు గుంతలను నిర్మించడం జరుగుతుంది. పనులు పూర్తైతే రోడ్డుపై నీరు నిల్వకుండా ఉంటుంది. మరోవైపు భూమిలోకి వర్షంనీరు చేరడంతో భూగర్భ నీటిమట్టం కూడా పెరుగుతుంది.

-ప్రసాద్, ఈఈ, హెచ్ఎంఆర్ ప్రాజెక్టు